కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -222 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 23-08-2026 ఆదివారం పేజీలు : 4


మిగతాది 2 లో..

# కొండాకు కౌంట్‌డౌన్!

**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలనే యోచనలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. అందులో భాగంగానే సీఎల్పీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆమెకు వ్యతిరేకంగా గళం విప్పారని టాక్ ఉంది. ఈలోపు మనసు మార్చుకుని తన కుమార్తె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సురేఖ క్షమాపణలు చెప్తే వివాదానికి ఫుల్ స్టాప్ పడే ఛాన్స్ ఉంది. లేకపోతే మాత్రం సమయం, సందర్భం చూసుకుని బర్తరఫ్ చేసేందుకు ప్లానింగ్ చేస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో జరుగుతోన్న పరిణామాలను ఎప్పటికప్పుడు ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆరా తీస్తున్నారు.

బయటకు పంపడమే పరిష్కారం!

సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్‌గా చేసుకుని కుమార్తె సుస్మితా పటేల్ చేసిన విమర్శలకు తనకేం సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ తన వివరణలో పేర్కొనడంతో వివాదం మరింత ముదిరింది. ఆమెపై చర్యలు తీసుకోవాలని 17 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు సీఎల్పీలో సమావేశమై డిమాండ్ చేశారు.

- బర్తరఫ్‌కు రంగం సిద్ధం!
- సురేఖపై ఎమ్మెల్యేల తిరుగుబాటు!
- సారీ చెప్తే సరి.. లేకుంటే వేటే!
- కొండా ఫ్యామిలీపై గుర్రుగా అధిష్టానం!
- సీఎం రాక కోసం ఎదురుచూపులు!
- 17 మంది ఎమ్మెల్యేల ఫిర్యాదు!
- కేబినెట్ నుంచి తప్పించాలంటూ డిమాండ్!
- మీనాక్షి చేతిలో 'కొండా' ఫైల్!
- పునర్వ్యవస్థీకరణలోనైనా ఉద్వాసన?

# ఎల్‌పీజీ పైప్‌లైన్‌కు గ్రీన్ సిగ్నల్!

- 1,800 కి.మీ కొత్త పైప్‌లైన్లు
- రూ.7 వేల కోట్లతో భారీ విస్తరణ
- 9,500 కి.మీకి పెరగనున్న నెట్‌వర్క్
- తెలంగాణ నుంచి మహారాష్ట్రకు పైప్‌లైన్
- రోడ్డు రవాణాకు ఇక చెక్!
- రవాణా ఖర్చులు భారీగా తగ్గే అవకాశం
- ఎల్‌పీజీ సరఫరాకు మరింత భద్రత



**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** దేశంలో ఇంధన సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఆయిల్ రంగ రెగ్యులేటర్ పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.7,000 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 1,800 కిలోమీటర్ల మేర కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్ల నిర్మాణానికి రవాణా అనుమతులు మంజూరు చేసింది. ఈ నూతన ప్రాజెక్టులతో ప్రస్తుతం ఉన్న 7,700 కిలోమీటర్ల కామన్-క్యారియర్ ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ఒక్కసారిగా 23.5 శాతం పెరిగి దాదాపు 9,500 కిలోమీటర్లకు చేరనుంది.

2 లో

# ఏపీకి కేంద్రం మరో గుడ్‌న్యూస్!


2 లో

**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, నౌకా నిర్మాణ రంగాల్లో కొత్త శకానికి తెరలేవనుంది. ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ రాష్ట్రంలో ఒక భారీ షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయడానికి సుముఖత వ్యక్తం చేసింది.

# కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ డీల్!

- హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్‌కు ప్లాన్
- యువ పారిశ్రామికవేత్తలకు బూస్ట్
- స్టార్టప్‌లకు కేంబ్రిడ్జ్ సహకారం
- సంయుక్త పరిశోధనలకు గ్రీన్ సిగ్నల్
- హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా
- తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి
- 'తెలంగాణ రైజింగ్'కు మరో బలం
- కార్యాచరణ ప్రణాళికపై కీలక నిర్ణయం



**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై యూనివర్సిటీ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా యువ పారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం కోరారు.

2 లో

# నోటీసులు వెనక్కి తీసుకోండి!


2 లో

- నోటీసులు వెంటనే ఉపసంహరించాలి
- ఎమ్మెల్యేపై బహిరంగంగా అసంతృప్తి
- 40 ఏళ్లుగా పార్టీకి అంకితమయ్యా
- పార్టీ పెద్దల దృష్టికి సమస్య తీసుకెళ్లా
- బహిరంగ వ్యాఖ్యలపైనే షోకాజ్ నోటీసులు
- క్రమశిక్షణ ఉల్లంఘనపై కమిటీ ఆగ్రహం

# ఢిల్లీలో స్వైన్ ఫ్లూ విజృంభణ..



2 లో

- ఒక్కరోజే 114 కేసులు.. కలకలం
- హెచ్1ఎన్1తో ఢిల్లీలో హై అలర్ట్
- గతేడాది కంటే 8 రెట్లు అధికం
- 2,392కు చేరిన ఫ్లూ కేసులు
- 1,777 కేసులు హెచ్1ఎన్1వే
- డేంజర్ బెల్స్ మోగిస్తున్న స్వైన్ ఫ్లూ

# ఏపీలో జాబ్ జాతర.. 10 వేలకుపైగా పోస్టులు

- 10,060 పోస్టులకు గ్రీన్‌సిగ్నల్
- నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీ
- సెప్టెంబర్ 15న 3,231 పోస్టులు
- గ్రూప్-1లో 149 ఖాళీలు
- పోలీసు శాఖలో 724 పోస్టులు
- అక్టోబర్ 15న మరో 2,311 పోస్టులు



**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది రాష్ట్రంలోని కూటమి సర్కార్.. 2026 జాబ్ క్యాలెండర్‌లో భాగంగా మొత్తం 10,060 ప్రభుత్వ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ఉద్యోగాలను నాలుగు దశల్లో భర్తీ చేయనున్నారు. ఇప్పటికే తొలి దశలో 1,523 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. రెండో దశలో భాగంగా సెప్టెంబర్ 15న 3,231 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇందులో గ్రూప్-1 కేటగిరీలో 149 పోస్టులు ఉన్నాయి. అలాగే పోలీస్ శాఖలో 542 కానిస్టేబుల్ పోస్టులు, 182 సివిల్ ఎస్ఐ పోస్టులను ఈ దశలో భర్తీ చేయనున్నారు.

2 లో


# మాదాపూర్‌లో భారీ ప్రమాదం!

- ఒక్కసారిగా కుప్పకూలిన ఏడంతస్తుల భవనం
- భవనం కూలడంతో భయాందోళనలు
- శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు అనుమానం
- ముగ్గురు లోపల ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షుల వెల్లడి
- పక్కనున్న అపార్ట్‌మెంట్లకు శిథిలాల తాకిడి
- రంగంలోకి పోలీసులు, డిజాస్టర్ బృందాలు
- శిథిలాల తొలగింపు చర్యలు ముమ్మరం

2 లో

# సన్న వడ్ల రైతులకు బిగ్ అలర్ట్.. రూ.500 బోనస్‌కు ఇదే రూల్!

- సెప్టెంబర్ 10 చివరి గడువు
- 7 రకాల విత్తనాలకే బోనస్
- రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి
- ఆధార్.. పాస్‌బుక్.. బిల్లు తప్పనిసరి
- పాత బిల్లులతో రైతుల అవస్థలు
- దుకాణాల చుట్టూ రైతుల పరుగులు
- ఇతర రకాల సాగుతో బోనస్‌కు బ్రేక్
- సొంత విత్తనాల రైతులకు ఊరట
- రైతుల్లో నిబంధనలపై అయోమయం


2 లో

# సింధు జలాలపై పాక్‌కు కొత్త భయం

- సింధు జలాలపై పాక్‌లో కొత్త భయం
- భారత్ నీటిని ఆయుధంగా వాడొచ్చని ఆరోపణ
- పహల్గామ్ తర్వాత నిలిచిన జలాల ఒప్పందం
- పాక్ వ్యవసాయానికి సింధు నదే జీవనాడి
- భారత్‌దే వ్యూహాత్మక పైచేయి అంటున్న పాక్
- దక్షిణాసియాలో భారత్‌దే కీలక పాత్ర

2 లో

# పనిచేస్తే వచ్చే కిక్కే వేరు!

- అనకాపల్లికి సెప్టెంబర్‌లోనే నీళ్లు
- దేశంలో నంబర్ వన్‌గా నిలుపుతాం
- గూగుల్ డేటా సెంటర్‌పై కీలక వ్యాఖ్యలు
- అసత్య ప్రచారాలపై చంద్రబాబు ఫైర్
- వెలిగొండ తొలి దశకు ముహూర్తం
- 2,027 నిర్వాసిత కుటుంబాలకు పరిహారం

2 లో

# మాదాపూర్‌లో భారీ ప్రమాదం!




**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంజయ్య నగర్‌లో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. శనివారం మధ్యాహ్నం వేళ చోటుచేసుకున్న ఈ ప్రమాదంతో ఒక్కసారిగా శబ్దాలు రావడంతో స్థానికులు, సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనలతో వీధుల్లోకి పరుగులు తీశారు. భవనం కూలిపోయిన సమయంలో లోపల ముగ్గురు వ్యక్తులు ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా సమాచారం అందుతోంది. మరికొందరు కూలీలు లేదా స్థానికులు శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని అనుమానిస్తున్నారు. భవనం కూలిన తీవ్రతకు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్లపై కూడా భారీగా శిథిలాలు పడటంతో ఆ నిర్మాణాలకు కూడా స్వల్పంగా నష్టం వాటిల్లింది.

సహాయక చర్యలు ముమ్మరం..

మాచారం అందుకున్న వెంటనే పోలీసులు, డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు ప్రమాద స్థలానికి చేరుకున్నాయి. శిథిలాల తొలగింపు చర్యలను వేగవంతం చేసి, లోపల ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

# పనిచేస్తే వచ్చే కిక్కే వేరు!



**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** అనకాపల్లి జిల్లాలోని ఏ-కూడూరులో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంతీయ అభివృద్ధి, నీటి పారుదల ప్రాజెక్టులు మరియు పరిశ్రమల పురోగతిపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "అనకాపల్లి అంటే కేవలం బెల్లం మార్కెట్ మాత్రమే కాదు, ఇది ప్రధానమైన ఇండస్ట్రియల్ ఏరియాగా రూపాంతరం చెందుతోంది. రాబోయే రోజుల్లో అనకాపల్లి దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలుస్తుంది. సెప్టెంబర్ మొదటి వారంలోనే అనకాపల్లికి నీళ్లు తెచ్చి చూపిస్తాం" అని హామీ ఇచ్చారు. తాము చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక కొందరు అడ్డుకోవడానికి, దుష్ప్రచారం చేయడానికి ప్రయత్నిస్తున్నారని సీఎం మండిపడ్డారు. "విశాఖకు గూగుల్ డేటా సెంటర్ను తీసుకువచ్చాం. త్వరలోనే మన దేశానికి క్వాంటం కంప్యూటర్స్ కూడా రాబోతున్నాయి. అయితే డేటా సెంటర్ ప్రారంభం కాకుండానే నీళ్లు ఇంకిపోయాయని, డేటా సెంటర్ వస్తే నీళ్లు దొరకవంటూ కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. అసలు డేటా సెంటర్ అంటే ఏంటో తెలియని వాళ్లే ఇటువంటి కామెంట్స్ చేస్తున్నారు. నాకు ఎప్పుడూ సవాళ్లే ఎదురవుతాయి.. ఏ మంచి పని చేస్తున్నా విమర్శలు తప్పవు. కానీ మేం చేసిన పనిని ప్రజలు అభిమానిస్తే వచ్చే కిక్కే వేరు" అని పేర్కొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం..

సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న వెలిగొండ ప్రాజెక్టుపై సీఎం స్పందిస్తూ, అసాధ్యమనుకున్న 30 ఏళ్ల వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని సాధ్యం చేసి చూపించామని హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్ట్ మొదటి దశను ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. ప్రాజెక్టు నిర్వాసితులకు మూడో విడత కింద 2,027 కుటుంబాలకు రూ.250 కోట్ల పరిహారాన్ని అందజేసినట్లు వివరించారు. రాష్ట్రంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని సమతుల్యం చేస్తూ ముందుకెళ్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఏపీకి కేంద్రం మరో గుడ్‌న్యూస్!



**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, నౌకా నిర్మాణ రంగాల్లో కొత్త శకానికి తెరలేవనుంది. ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ రాష్ట్రంలో ఒక భారీ షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయడానికి సుముఖత వ్యక్తం చేసింది. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లాలోని దుగరాజపట్నం వద్ద ప్రతిపాదిత షిప్‌యార్డు నిర్మాణంలో భాగస్వామిగా ఉండేందుకు ముందుకొచ్చింది.

ఆర్థిక స్వరూపమే పూర్తిగా మారిపోయే ఛాన్స్

ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా చర్చించేందుకు ఇటీవల ఎండీఎల్ ప్రతినిధి బృందం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ మెగా ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ. 26,000 కోట్ల మేర భారీ పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ పెట్టుబడులు అందుబాటులోకి వస్తే ఏపీ సుదీర్ఘ తీర ప్రాంత ఆర్థిక స్వరూపమే పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది.

ముమ్మర చర్యలు

దుగరాజపట్నం షిప్‌బిల్డింగ్ క్లస్టర్ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. ఈ మేరకు డీపీఆర్ తయారు చేసేందుకు తగిన ప్రతిష్ఠాత్మక సంస్థను ఎంపిక చేసే ప్రక్రియను వేగవంతం చేసింది. దీనికి సంబంధించిన అధికారిక నిర్ణయం త్వరలోనే వెలువడనుందని సమాచారం.

స్థానిక యువతకు విస్తృత అవకాశాలు

ఈ క్లస్టర్ అందుబాటులోకి వస్తే నౌకా నిర్మాణం, మరమ్మతులు, దానికి సంబంధించిన అనుబంధ పరిశ్రమల ద్వారా స్థానిక యువతకు విస్తృత అవకాశాలు దక్కుతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి కొత్త ఉపాధి లభిస్తుంది. దీనివల్ల నెల్లూరు జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధి మరింత వేగం పుంజుకోనుంది. కేంద్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. సముద్ర ఆధారిత మౌలిక వసతులను పటిష్టం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత అగ్రగామి నౌకా నిర్మాణ కేంద్రంగా తీర్చిదిద్దడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా పని చేస్తోంది.

# ఎల్‌పీజీ పైప్‌లైన్‌కు గ్రీన్ సిగ్నల్!

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ రంగానికి చెందిన ప్రముఖ సంస్థ 'గేల్ (ఇండియా) లిమిటెడ్' ద్వారా ఈ విస్తరణ పనులు చేపడుతున్నారు.




ఈ ప్రాజెక్టులో భాగంగా తెలంగాణలోని చెర్లపల్లి నుండి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కిలోమీటర్లు, ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నుండి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు 611 కిలోమీటర్లు, అలాగే మహారాష్ట్రలోని షిక్రాపూర్ నుండి గోవా, కర్ణాటకలోని హుబ్లీ వరకు 633 కిలోమీటర్ల మేర మూడు ప్రధాన పైప్‌లైన్లు నిర్మించనున్నారు. దేశంలో అత్యంత పొడవైన 2,757 కిలోమీటర్ల కండ్లా-గోరఖ్‌పూర్ ఎల్‌పీజీ పైప్‌లైన్ తర్వాత మంజూరైన అతిపెద్ద నెట్‌వర్క్ విస్తరణ ఇదే కావడం గమనార్హం.

ప్రస్తుతం విదేశాల నుండి దిగుమతి అయ్యే ఎల్‌పీజీ సరుకు ప్రధానంగా సముద్ర తీరప్రాంత పోర్టులకు చేరుకుంటుంది. అక్కడి నుండి దేశంలోని వివిధ బాట్లింగ్ ప్లాంట్లకు రోడ్డు మార్గంలో భారీ ట్యాంకర్ల ద్వారా గ్యాస్‌ను రవాణా చేస్తున్నారు. కొత్త పైప్‌లైన్ల నిర్మాణంతో రోడ్డు రవాణాపై ఆధారపడటం గణనీయంగా తగ్గుతుంది. దీనివల్ల ప్రమాదాల ముప్పు తప్పడంతో పాటు రవాణా వ్యయం తగ్గడం, ట్రాఫిక్ ఇబ్బందులు తొలగడం, కార్బన్ ఉద్గారాలు తగ్గి పర్యావరణానికి మేలు జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా చూడటమే ఈ ప్రాజెక్టుల ముఖ్య ఉద్దేశమన్నారు.

# కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ డీల్!

మొదటి పేజీ తరువాయి

స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాల నిర్ణయం తీసుకున్నాయి.

**తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి:**

ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను ఈ సందర్భంగా సీఎం కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, అదే సంస్థకు చెందిన ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోట గారు, 'ఫ్రూగల్ ఏఐ' కో-చైర్ తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న అవకాశాలపై వారు ప్రత్యేకంగా సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, సంయుక్తంగా పరిశోధనలు చేపట్టడం, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకరించడం వంటి అంశాల్లో భాగస్వామ్యానికి ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాలు అంగీకరించాయి.

**తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి బలం:**

ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో తెలంగాణ భాగస్వామ్యానికి ఈ చర్చలు కొత్త మార్గం చూపనున్నాయి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న 'తెలంగాణ రైజింగ్' లక్ష్యానికి ఈ సమావేశం మరింత బలం చేకూర్చనుంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

# నోటీసులు వెనక్కి తీసుకోండి!



**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) క్రమశిక్షణా కమిటీ ఇచ్చిన నోటీసులపై సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి డాక్టర్ చిన్నారెడ్డి తీవ్రంగా స్పందించారు. పార్టీ క్రమశిక్షణా కమిటీకి ఆయన సుదీర్ఘమైన వివరణాత్మక లేఖ రాశారు. 'నేనేమీ తప్పు చేయలేదు. ఎవరిపైనా అనుచిత వ్యాఖ్యలు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యే వ్యవహార శైలి ఒంటెద్దు పోకడలా ఉంది. ఆ ధోరణి వల్ల గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ జెండా మోస్తున్న నిబద్ధత కలిగిన నేతలు, కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఏనాడూ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు. గాంధీ భవన్, ఇందిరా భవన్ నాకు దేవాలయాలతో సమానం. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను దేవుళ్లుగా భావిస్తాను. అలాంటి నాకు నోటీసులు ఇవ్వడం బాధకరం. పరిస్థితి హద్దు దాటిపోతుందనే ఉద్దేశంతోనే పార్టీ పెద్దల దృష్టికి సమస్యను తీసుకెళ్లే ప్రయత్నం చేశాను. నా భావప్రకటనను తప్పుగా అర్థం చేసుకుని ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలి' అని చిన్నారెడ్డి లేఖలో పేర్కొన్నారు.

చిన్నారెడ్డికి నోటీసులు ఎందుకు ఇచ్చారంటే?

వనపర్తి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి వ్యవహార శైలిపై చిన్నారెడ్డి బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడమే ఈ నోటీసులకు ప్రధాన కారణం. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలను, సీనియర్లను పట్టించుకోకుండా ఎమ్మెల్యే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని చిన్నారెడ్డి మీడియా ముఖంగా విమర్శలు గుప్పించారు. పార్టీ అంతర్గత వేదికలపై మాట్లాడాల్సిన అంశాలను బహిరంగంగా, మీడియా ముందుకు వెళ్లి మాట్లాడటం పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడమేనని టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ భావించింది. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసినందుకు వివరణ ఇవ్వాలని కోరుతూ చిన్నారెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

# సింధు జలాలపై పాక్‌కు కొత్త భయం




**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** పాకిస్తాన్ మరోసారి "సింధు జలాల ఒప్పందం"పై స్పందించింది. ఆ దేశ ప్రణాళికా మంత్రి అహ్సాన్ ఇక్బాల్ ఇటీవల ఇండస్ వాటర్ ట్రీటీ, దక్షిణాసియాలో భారత్ వ్యూహాత్మక ప్రాధాన్యతపై కీలక వ్యాఖ్యలు చేశారు. సింధు నది నీటిని ఆపేయడం ద్వారా భారత్ తమ దేశానికి వ్యతిరేకంగా నీటిని ఆయుధంగా ఉపయోగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ ఒక నదీతీర దేశమని, అక్కడి నుంచి ప్రవహించే నదులు పాకిస్తాన్‌లోకి ప్రవేశిస్తాయని ఇక్బాల్ పేర్కొన్నారు. ఈ భౌగోళిక పరిస్థితిని భారత్ తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటోందని, పాకిస్తాన్ నీటి సరఫరాను నియంత్రించే అవకాశం ఉందని ఆయన అన్నారు.

పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత, భారత్ పాకిస్తాన్‌పై "ఆపరేషన్ సిందూర్" దాడులు నిర్వహించడానికి ముందు "సింధు జలాల ఒప్పందం" నిలిపేసింది. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు తెలిపినంత కాలం ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించేది లేదని భారత్ స్పష్టం చేసింది. అయితే, ఇది ఏకపక్ష నిర్ణయమని పాక్ ఆరోపిస్తోంది. పాకిస్తాన్ వ్యవసాయం, తాగునీటికి సింధు, దాని ఉపనదులు జీవనాడిగా ఉన్నాయి. ఈ నీటిని నియంత్రిస్తే పాకిస్తాన్ కరువుతో అలమటించడం ఖాయమని ఆ దేశంలో ఆందోళన నెలకొంది.

ఇదే సమయంలో అహ్సాన్ ఇక్బార్ మరో కీలక వ్యాఖ్య చేశారు. దక్షిణాసియాలో భారత్ భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉందని, ఈ ప్రాంతం సక్రమంగా ఉండాలంటే భారత్ పాత్ర చాలా ముఖ్యమని పేర్కొన్నారు. దక్షిణాసియాలోని ఇతర దేశాలకు వివిధ మార్గాల్లో భారత్ కనెక్ట్ అయి ఉందని అన్నారు. భారతదేశ పరిమాణం, ఆర్థిక శక్తి, భౌగోళిక స్థానం కారణంగా ఈ ప్రాంత వ్యవహారాల్లో దాని ప్రాధాన్యతను విస్మరించలేమని అన్నారు. 1960లో ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వంతో భారత్-పాక్ మధ్య "సింధు జలాల ఒప్పందం" కుదిరింది. రెండు దేశాల ఉద్రిక్తతల కారణంగా మరోసారి ఈ ఒప్పందం వార్తల్లో నిలిచింది.

# ఏపీలో జాబ్ జాతర.. 10 వేలకుపైగా పోస్టులు

**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది రాష్ట్రంలోని కూటమి సర్కార్.. 2026 జాబ్ క్యాలెండర్‌లో భాగంగా మొత్తం 10,060 ప్రభుత్వ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ఉద్యోగాలను నాలుగు దశల్లో భర్తీ చేయనున్నారు. ఇప్పటికే తొలి దశలో 1,523 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. రెండో దశలో భాగంగా సెప్టెంబర్ 15న 3,231 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇందులో గ్రూప్-1 కేటగిరీలో 149 పోస్టులు ఉన్నాయి. అలాగే పోలీస్ శాఖలో 542 కానిస్టేబుల్ పోస్టులు, 182 సివిల్ ఎస్ఐ పోస్టులను ఈ దశలో భర్తీ చేయనున్నారు.

ఆ తర్వాత అక్టోబర్ 15న మూడో దశలో 2,311 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుంది. ఇందులో గ్రూప్-2లో 673 పోస్టులు ఉన్నాయి. అలాగే డిప్యూటీ తహసీల్దార్ పోస్టులకు సంబంధించి 200 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఇంజినీరింగ్‌తో పాటు ఇతర విభాగాల్లో మరో 1,638 పోస్టులు ఈ దశలో ఉన్నాయి. ఇక అక్టోబర్ 15న నాలుగో దశలో 2,995 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో అత్యధికంగా స్కూల్ ఎడ్యుకేషన్ శాఖలోనే 2,991 పోస్టులు ఉన్నాయి. దీంతో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు కూడా భారీగా అవకాశాలు లభించనున్నాయి.

మొత్తంగా 2026 జాబ్ క్యాలెండర్‌లో నాలుగు దశల్లో 10,060 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇప్పటికే తొలి దశ ప్రక్రియ ప్రారంభం కాగా, సెప్టెంబర్ 15 నుంచి రెండో దశ, అక్టోబర్ 15 నుంచి మూడో, నాలుగో దశల నోటిఫికేషన్లు వెలువడనున్నాయి. దీంతో రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న వేలాది మంది అభ్యర్థుల్లో ఆశలు పెరిగాయి.

# సన్న వడ్ల రైతులకు బిగ్ అలర్ట్.. రూ.500 బోనస్‌కు ఇదే రూల్!



**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లకు సంబంధించి క్వింటాకు 500 రూపాయల బోనస్ పథకంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. అక్రమాలను అరికట్టి నిజమైన లబ్ధిదారులకు మేలు చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. అయితే కొత్తగా విధించిన నిబంధనలు క్షేత్రస్థాయిలో రైతులకు తీవ్ర అయోమయాన్ని, ఆందోళనను కలిగిస్తున్నాయి.

ఈ బోనస్ సొమ్ము అందాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశించిన 7 రకాల సన్న వరి విత్తనాలను మాత్రమే సాగు చేసి ఉండాలి. అందులో ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా), కేఎన్ఎం 1638 (కూనారం వరి-2), జైశ్రీరామ్, కేఎన్ఎం 7715, బీపీటీ 5204 (సాంబమసూరు), హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి) రకాలు ఉన్నాయి. రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాలకు వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, కొనుగోలు బిల్లు సమర్పించి సెప్టెంబర్ 10వ తేదీలోగా తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు.

నెల రోజుల కిందటే విత్తనాలు కొనుగోలు చేసినందున ఇప్పుడు పాత బిల్లులు దొరకక, దుకాణాల చుట్టూ తిరగలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల వ్యాపారుల వద్ద రికార్డులు లేకపోవడంతో వాగ్వాదాలు జరుగుతున్నాయి. మరోవైపు మార్కెట్లో లభించే ఇతర రకాల సన్న వరిని సాగు చేసిన రైతులు తమకు బోనస్ వర్తించకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకుని సాగు చేసిన రైతులు కూడా ఏ దుకాణంలో నమోదు చేసుకోవాలో తెలియక గందరగోళానికి గురయ్యారు. ఈ సమస్యపై స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి స్పష్టతనిచ్చారు. సొంత విత్తనాలు వాడిన రైతులు దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానిక వ్యవసాయ అధికారులకు సొంత డిక్లరేషన్ రాసి ఇస్తే సరిపోతుందని తెలిపారు. సెప్టెంబర్ 10 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలోనే దాదాపు 2.51 లక్షల ఎకరాల్లో సన్న రకాలు సాగవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిబంధనలను మరింత సులభతరం చేయాలని రైతాంగం కోరుతోంది.

# ఢిల్లీలో స్వైన్ ఫ్లూ విజృంభణ..




**న్యూస్ డెస్క్, 22 ఆగష్టు (బిఎన్ఎస్):** దేశ రాజధాని ఢిల్లీలో మళ్లీ స్వైన్ ఫ్లూ కేసులు విజృంభిస్తున్నాయి. గతేడాది ఇదే సమయానికి ఉన్న కేసులకంటే.. ప్రస్తుతం 8 రెట్లు ఎక్కువగా కేసులు నమోదైనట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. పరిస్థితి చూస్తోంటే.. స్వైన్ ఫ్లూ డేంజర్ బెల్స్ మోగించేలా కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది (2026) ఇప్పటివరకు నమోదైన కేసుల సంఖ్య 2,392కు చేరుకోగా, అందులో ఏకంగా 1,777 కేసులు హెచ్1ఎన్1 (స్వైన్ ఫ్లూ) వైరస్‌కు సంబంధించినవే కావడం ఆందోళన కలిగిస్తోంది. ఒక్క గురువారమే నగరంలో 114 హెచ్1ఎన్1 కేసులు నమోదు కావడం వ్యాప్తి తీవ్రతకు అద్దం పడుతోంది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. సాధారణ ఫ్లూ లక్షణాలను తేలికగా తీసిపారేయవద్దని, ఇబ్బంది పెరిగితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించింది.

స్వైన్ ఫ్లూ లక్షణాలు

జ్వరం, దగ్గు, గొంతు నెప్పి, తలనొప్పి, ముక్కు కారడం, ఒళ్లు నొప్పులు, తీవ్రమైన అలసటతో పాటు కొంతమందిలో కళ్ళు ఎర్రబారడం, నీరు కారడం మరియు బలహీనత వంటి లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. గత ఏళ్లతో పోలిస్తే ఈసారి ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో కేసులు దాదాపు 6 రెట్లు పెరిగాయి. వాతావరణంలో ఉష్ణోగ్రతలు, తేమ ఎక్కువగా ఉండటమే ఈ వైరస్ వ్యాప్తికి ప్రధాన కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం, మాస్కులు ధరించడం, ఇతరులకు దూరంగా ఉండటం వంటి ప్రాథమిక జాగ్రత్తలు తప్పనిసరి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, వృద్ధులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు తీవ్ర అప్రమత్తంగా ఉండాలి. ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి పంకజ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్లు, డాక్టర్లు, మందులు, వైద్య పరికరాల కొరత లేదని, పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. బాధితుల్లో ఎక్కువమంది స్వల్ప లక్షణాలతోనే కోలుకుంటున్నప్పటికీ, లక్షణాలు తీవ్రమైతే ఆలస్యం చేయకుండా వైద్య చికిత్స తీసుకోవాలని సూచించారు.

# కొండాకు కౌంట్‌డౌన్!

మొదటి పేజీ తరువాయి

వీరంతా మీడియా ముందుకు వచ్చి కొండాకు వ్యతిరేకంగా మాట్లాడటం వెనుక సీఎం రేవంత్‌రెడ్డి గైడెన్స్ ఉండి ఉంటుంది. లేకపోతే ఆమెకు వ్యతిరేకంగా మాట్లాడే సాహసం చేయరు. పైకి మాత్రం పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్న లీడర్లు ఇంటర్నల్‌గా సురేఖను కేబినెట్ నుంచి తప్పించాలని అధిష్టానాన్ని కోరుతున్నారు.

ఆ లేఖల్లో గతంలో కొండా ఫ్యామిలీ తీరుతో జరిగిన నష్టాన్ని వివరిస్తున్నారు. ఇంకా ఆ కుటుంబంపై సానుకూల ధోరణి వద్దని, సురేఖను మంత్రివర్గం నుంచి బహిష్కరించడమే సరైన నిర్ణయమని అభిప్రాయపడుతున్నారు. సురేఖను బర్తరఫ్ చేస్తే, భవిష్యత్‌లో సీఎంకు వ్యతిరేకంగా గళం విప్పేందుకు లీడర్లు సాహసం చేయరని, లేకపోతే మరింత మంది రెచ్చిపోయే ప్రమాదం ఉంటుందనే చర్చ పార్టీ వర్గాల్లో ఉంది.

సీఎంకు వచ్చాక సారీ చెప్తారా?

తనపై చర్యలు తీసుకోవాలని సీఎల్పీ వేదికగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గళం విప్పడంపై సురేఖ మౌనంగా ఉన్నారు. తనకు వ్యతిరేకంగా జరుగుతోన్న పరిణామాలపై స్పందించేందుకు నిరాకరించిన ఆమె మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ 'నేను చెప్పాల్సిన విషయాన్ని ఇప్పటికే పీసీసీ క్రమశిక్షణ కమిటీకి చెప్పాను. ఇంకా నేను చెప్పేది ఏం లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఫారిన్ టూర్ నుంచి వచ్చిన తర్వాత మాట్లాడుతా'అని పేర్కొన్నారు. దీంతో రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు వచ్చిన తరువాత సురేఖ తీసుకునే నిర్ణయంపై ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నది. తన కుమార్తె చేసిన విమర్శలపై క్షమాపణలు చెప్తారా? లేకపోతే మరింత దూకుడుగా ఆమె వ్యవహరిస్తారా ? అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొన్నది. ఒకవేళ ఆమె సారీ చెప్తే వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాలనే యోచనలో ఏఐసీసీ ఉన్నట్టు తెలిసింది.

హైకమాండ్ ఆరా..

కొండా సురేఖ కుమార్తె చేసిన విమర్శల తర్వాత పార్టీలో జరుగుతోన్న పరిణామాలపై ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆరా తీస్తున్నారు. సుస్మిత ఏం మాట్లాడారు? ఆమె తల్లి సురేఖ ఇచ్చిన వివరణ ఏంటీ ? అందుకు ప్రతిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏ విధంగా స్పందించారు ? అనే కోణంలో ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నట్టు తెలిసింది. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత సురేఖపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై ఆయనతో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

ఒకవేళ సురేఖపై చర్యలు తీసుకోవాలంటే తలెత్తే పరిణామాలు ఏ విధంగా ఉంటాయనే కోణంలో మీనాక్షి ఆరా తీస్తున్నట్టు తెలుస్తున్నది. 'సురేఖ క్షమాపణలు చెప్తే వివాదం సమిసిపోతుంది. లేకపోతే మాత్రం మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడం. అలా చేస్తే ఎక్కువ నష్టం జరుగుతుందంటే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ సమయంలో ఆమెను తప్పించే అవకాశం ఉంటుంది' అని ఏఐసీసీకి సన్నిహితంగా ఉండే ఓ నేత అభిప్రాయపడ్డారు.

### మా ఇల్లు - మా కుటుంబం - మన జిల్లా జాగృతమై

# పరిసరాల పరిశుభ్రతపై బాధ్యత కలిగి ఉండాలి




అమలాపురం (బిఎన్ఎస్)ఆగస్టు 22 : మా ఇల్లు – మా కుటుంబం – మన జిల్లా జాగృతమై పరిసరాల పరిశుభ్రతపై బాధ్యత కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్.నైడియా దేవి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.

అమలాపురం మండలం కామన గరువు గ్రామపంచాయతీలోని స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొని పరిసరాల పరిశుభ్రత నిర్వహణపై మాట్లాడారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలో మొక్కలు నాటి స్వచ్ఛ సర్వేక్షన్ లో పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, పరిశుభ్రత అనేది మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి పేర్కొన్నారు.

జిల్లాలోని పరిసరాల పరిశుభ్రత కావాలంటే ప్రతి ఒక్కరూ మా ఇల్లు – మా కుటుంబం– మన జిల్లా ఆత్మ పరిశీలన చేసుకుని చెత్త సేకరణ పై దృష్టి సారించాలన్నారు.

మన కుటుంబంలోని మన ఇల్లును ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో మన జిల్లాను కూడా అంత శుభ్రంగా ఉంచే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెత్త సేకరణను చేసి ప్రజలలో ఒకరికి ఒకరు చెత్త నిర్మూలనపై కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ గ్రామాలు**

పరిశుభ్రత అనేది ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛమైన గ్రామాలను నిర్మించగలమని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, రోడ్ల పక్కన వ్యర్థాలను పడవేయడం, కాలువల్లో చెత్త వేయడం వంటి చర్యలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, పంచాయతీ సిబ్బందికి అందించాలని తెలిపారు.

ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వచ్చినప్పుడే పరిశుభ్రమైన సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పరిశుభ్రతను ఒక కార్యక్రమంగా కాకుండా నిత్య జీవితంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని ప్రతి కుటుంబం పరిశుభ్రతపై అవగాహన కలిగి, తమ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**స్వచ్ఛతా ప్రతిజ్ఞ**

అనంతరం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, అధికారులు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో పరిసరాల పరిశుభ్రతపై స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛమైన గ్రామాలు, స్వచ్ఛమైన మండలాలు, స్వచ్ఛమైన జిల్లాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరచాలని అధికారులకు సూచించారు.

**మొక్కలు నాటిన జాయింట్ కలెక్టర్**

'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ గ్రామ పంచాయతీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత రెండూ పరస్పరం అనుసంధానమై ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కల పెంపకంతో గ్రామాల్లో పచ్చదనం పెరగడంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.

**పారిశుధ్య కార్మికులతో ముఖాముఖి**

అనంతరం గ్రామంలో పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికులతో జాయింట్ కలెక్టర్ నేరుగా మాట్లాడారు. గ్రామంలో ప్రతిరోజూ చేపడుతున్న చెత్త సేకరణ విధానం, తడి--పొడి చెత్త వేర్పాటు, చెత్త తరలింపు, పారిశుధ్య నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్న సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

గ్రామంలో చెత్త సేకరణ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడాలని, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, డ్రైనేజీలు, బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

గ్రామ ప్రజలకు పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు కూడా అధికారులకు సహకరిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు ముందుకు రావాలని కోరారు.

# రెండు వేల మంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం స్పందించాలి: పి.వి. సునీల్

అమలాపురం,(బిఎన్ఎస్)ఆగస్టు 22 :కోనసీమ జిల్లా:

గురుకుల పాఠశాలల మూసివేత, విద్యార్థుల భవిష్యత్తు తదితర అంశాలపై అంబేద్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో స్పందించారు.

రాష్ట్రంలో మూడు గురుకుల పాఠశాలలను మూసివేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎక్సలెన్సీ' పేరుతో సుమారు 2,000 మంది విద్యార్థుల భవిష్యత్తుకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

గురుకుల పాఠశాలల వ్యవహారంలో ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మేడాద్రిగడ్డ, తాడికొండ, కోట గురుకుల పాఠశాలలను ప్రభుత్వం మూసివేసిందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల సమస్యలపై గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అసెంబ్లీలో స్పందించడాన్ని పి.వి. సునీల్ అభినందించారు. అదే విధంగా తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ఈ సమస్యపై తక్షణం స్పందించాలని కోరారు. విశాఖ వెస్ట్ ఎమ్మెల్యే గణబాబు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ ఈ అంశంపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

**పోలీసులపై తీవ్ర ఆరోపణలు**




పోలీసులపై కూడా పి.వి. సునీల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొందరు పోలీసులు గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. పోలీసు విధులు నిర్వహించడం మినహా ఇతర వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు.

అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత పోలీసు అధికారులు లేదా శాఖ నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉందన్నారు.

**రాజకీయ అంశాలపైనా వ్యాఖ్యలు**

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కేసులో ఇరికించే ప్రయత్నం జరుగుతోందని పి.వి. సునీల్ ఆరోపించారు.

ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా గురుకుల విద్యార్థుల సమస్యలపై స్పందించాలని ఆయన కోరారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

**మీడియాపైనా అసంతృప్తి**

గురుకుల విద్యార్థుల సమస్యలను మీడియా, న్యూస్ పేపర్లు తగినంతగా పట్టించుకోవడం లేదని పి.వి. సునీల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

రెండు వేల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి స్పష్టత ఇవ్వాలని పి.వి. సునీల్ డిమాండ్ చేశారు.

# దేవుని కడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జీర్ణోద్ధారణ, అష్టబంధన, మహాసంప్రోక్షణకు అంకురార్పణ..




కడప జిల్లా (బిఎన్ఎస్)ఆగస్టు 22 :దేవుని కడపలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జీర్ణోద్ధారణ అష్టబంధన, మహాసంప్రోక్షణకు ఆగస్టు 23 న సాయంత్రం అంకురార్పణ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించనున్నారు. ఆగస్టు 23 న సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు వాస్తుశాంతి, మృత్సంగ్రహణము, కుంభారాధన, అంకురార్పణ కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆగస్టు 24 న ఉదయం 8 గంటలకు మనోన్మాన ప్రమాణ శాంతి హోమము, కుంభస్థాపన, పంచాగ్ని ప్రణయనము, శాత్తుమొర, సాయంత్రం 6.30 గంటలకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆగస్టు 25 న ఉదయం 7.30 గంటలకు చతుస్థానార్చన, ఏకశీతి కలశ స్నపనము, మూర్తి హోమము, అష్టబంధనం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు శయ్యాధివాసం, తత్వ హోమాలు, శాంతి హోమం, శాత్తుమొర కార్యక్రమాలు జరుగుతాయి. ఆగస్టు 26 న ఉదయం 7 గంటలకు చతుస్థానార్చన, మూర్తి హోమము, ప్రాయశ్చిత్త హోమము నిర్వహిస్తారు. ఉదయం 9.45 నుంచి 11.30 గంటల వరకు శ్రవణనక్షత్రం, తులా లగ్నంలో మహా పూర్ణాహుతి, మహాసంప్రోక్షణ, కళాకర్షణ కార్యక్రమాలను ఆగమోక్తంగా నిర్వహించనున్నారు. మహాసంప్రోక్షణ కార్యక్రమాలు పూర్తయిన అనంతరం 26 వ తేదీ మధ్యాహ్నం నుండి స్వామి, అమ్మవార్ల, మూలవార్ల దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

# ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక సమావేశం

నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్)ఆగస్టు 22 :ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై రాపూరు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సర్వపక్ష ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ లక్ష్మీ నరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితాను పారదర్శకంగా, ఎలాంటి తప్పులు లేకుండా రూపొందించడమే (సర్ ) ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులతో పాటు నో మ్యాపింగ్, అనామలీస్ నోటీసులకు సంబంధించిన వివరాలను అధికారులకు మరియు నాయకులకు వివరించారు.మ్యాపింగ్ కాని ఓటర్లు తమ వివరాలను వెంటనే పూర్తి చేసుకోవాలని, పేర్లలో అక్షర లేదా సంఖ్యా దోషాలు ఉన్నవారు సంబంధిత గ్రామ పంచాయతీలలో నిర్వహించే హియరింగ్‌కు హాజరై సరిచేసుకోవాలని సూచించారు. హియరింగ్ సమయంలో కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఏదైనా ఒక అధికారిక గుర్తింపు కార్డును తప్పనిసరిగా చూపించాలని స్పష్టం చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంలోనూ, ఓటర్ల జాబితా శుద్ధీకరణలోనూ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లు చురుగ్గా భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ, వైసీపీ, బీజేపీ, జనసేన పార్టీల ప్రతినిధులతో పాటు స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నాగార్జున సాగర్ కు నిలకడగా వరదనీటి రాక...



నల్లగొండ(బిఎన్ఎస్)ఆగస్టు 22 :నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు నిలకడగా వస్తోంది.. ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో ప్రాజెక్టు కుడి ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తుండటం తో దాదాపు 55, వేల క్యూసెక్కుల వరదనీరు సాగర్ కు ఇన్ఫ్లో గా వస్తోంది.. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 534అడుగులకు చేరింది. ప్రాజెక్టు గరిష్ట మట్టం చేరడానికి మరో 140టీఎంసీ ల నీరు అవసరం ఉందని అధికారులు తెలిపారు.. జంటనగరాల తాగునీటి అవసరాల నిమిత్తం 500 క్యూసెక్కుల నీటిని మాత్రమే బయటకు విడుదల చేస్తున్నారు.

## జీవో 97ను తక్షణమే ఉపసంహరించాలి ..




నల్లగొండ(బిఎన్ఎస్)ఆగస్టు 22 : పాలిటెక్నిక్ కళాశాలలను నైపుణ్య విశ్వవిద్యాలయ పరిధిలోకి తీసుకురావాలనే నిర్ణయాన్ని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తీవ్రంగా ఖండిస్తోందని ఎబివిపి రాష్ట్ర నాయకులు ఆవుల సంపత్ అన్నారు... దశాబ్దాలుగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తున్న పాలిటెక్నిక్ వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా విడుదల చేసిన జీవో నంబర్ 97 ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నల్లగొండ ఎబివిపి కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ, రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ మండలి ఆధ్వర్యంలోనే కొనసాగించాలని, మూడేళ్ల డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందే అవకాశం కొనసాగుతుందా లేదా అనే అంశంపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని అన్నారు.. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరించే ప్రయత్నాలను కూడా నిలిపివేసి విద్యార్థులకు భరోసా కల్పించాలని అన్నారు.. జీవో 97పై ప్రభుత్వం తక్షణమే పునరాలోచించకపోతే, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

## పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలకు హాజరైన ఎంపీ హరీష్ బాలయోగి....



అమలాపురం (బిఎన్ఎస్)ఆగస్టు 22 : అమలాపురం గడియార స్తంభం వద్ద జరిగిన, సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్న పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి గారి 71 వ పుట్టినరోజు వేడుకకు ఎంపీ హరీష్ బాలయోగి హాజరయ్యారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన వారిని అభినందించారు. అలాగే అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ ను కటింగ్ చేసి, పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గారు, మెట్ల రమణబాబు లతో కలిసి పేదలకు చీరలు మరియు దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సినిమా థియేటర్లలో ఎస్ఐఆర్ 2026 పై అవగాహన కల్పించాలి.!

**• జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి**



కడప(బిఎన్ఎస్)ఆగస్టు 22 :ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2026 లో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాపై అర్హులైన పౌరులు తమ అభ్యంతరాలు, క్లెయిమ్‌లను నిర్ణీత గడువులోగా దాఖలు చేసేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఈ మేరకు సినిమా థియేటర్లలో ప్రతి సినిమా ప్రారంభానికి ముందు, అలాగే విరామ సమయంలో ఓటరు అవగాహనకు సంబంధించిన వీడియోలు, ప్రచార చిత్రాలను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఇప్పటికే సమాచార, రెవెన్యూ అధికారుల ద్వారా సంబంధిత సినిమా థియేటర్ యాజమాన్యాలకు సూచనలు అందించామన్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు, వివరాలను పరిశీలించుకోవడంతో పాటు అర్హులైన వారు తమ క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్ణీత విధానంలో దాఖలు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ అవగాహన ప్రచార వీడియోలను ఆగస్టు 30, 2026 వరకు సినిమా థియేటర్లలో ప్రదర్శించాలని కోరినట్లు కలెక్టర్ చెరుకూరి పేర్కొన్నారు.

## నేనేం తప్పుగా మాట్లాడలేదు: చిన్నారెడ్డి లేఖ



హైదరాబాద్,బిఎన్ఎస్(ఆగస్టు 22) : వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ(డీఏసీ) ఇచ్చిన షోకాజ్ నోటీసులపై ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి స్పందించారు. తానేం తప్పుగా మాట్లాడలేదని లేఖలో పేర్కొన్నారు. "ఏ రోజూ నేను పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు. ఎవరిపైనా అనుచిత వ్యాఖ్యలు చేయలేదు. రెండున్నరేళ్లుగా కార్యకర్తల ఆవేదనను వ్యక్తంచేశా. స్థానిక ఎమ్మెల్యే వ్యవహారం ఒంటెద్దుపోకడలా ఉంది. నేతలు, కార్యకర్తలు పడుతున్న ఆవేదననే తెలిపా. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడాలనే ఉద్దేశం నాకు లేదు. పార్టీకి నష్టం కలిగించేవారిని ప్రశ్నించడమే నా ఉద్దేశం. నాపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం. వాటిపై విచారణ జరిపి న్యాయం చేయాలి" అని లేఖలో పేర్కొన్నారు.

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్
23-08-2026

# కాకినాడ జీజీహెచ్‌లో అధునాతన క్యాన్సర్ చికిత్సా కేంద్రం రూ. 36.6 కోట్లతో రేడియోథెరపీ లీనాక్ యంత్రం

- ఫలించిన ఉప ముఖ్యమంత్రివర్యుల కృషి...
- ఏడు జిల్లాల పరిధిలో క్యాన్సర్ రోగులకు ఉపయుక్తం. త్వరలో అందుబాటులోకి రానున్న రూ. 3.5 కోట్ల మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం



కాకినాడ(బిఎన్ఎస్)ఆగస్టు 22 :కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)లో అధునాతన క్యాన్సర్ చికిత్సా కేంద్రం ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమం కావడం తూర్పుగోదావరి, కోనసీమ ప్రాంతాల ప్రజలకు ఎంతో శుభవార్త. క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధికి చికిత్స కోసం ఇప్పటివరకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్న ప్రజలకు ఈ కేంద్రం భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా మారనుంది. సుమారు రూ.36 కోట్లతో ఈ అధునాతన క్యాన్సర్ చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఓఎన్జీసీ తన సామాజిక బాధ్యత నిధుల ద్వారా సహకారం అందించేందుకు ముందుకు వచ్చింది. ఈ కేంద్రంలో అధిక శక్తి రేఖీయ వేగవర్ధక యంత్రం, కంప్యూటెడ్ టోమోగ్రఫీ అనుకరణ యంత్రం వంటి అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ తీసుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తన సామాజిక మాధ్యమ ఖాతాలో వెల్లడించింది.

ఇందులో ప్రధానంగా ఉపయోగించబోయే అధిక శక్తి రేఖీయ వేగవర్ధక యంత్రం క్యాన్సర్‌కు కిరణ చికిత్స అందించడంలో అత్యంత కీలకమైన పరికరం. ఇది అధిక శక్తి గల ఎక్స్‌రే లేదా ఎలక్ట్రాన్ కిరణాలను ఉత్పత్తి చేసి, శరీరంలోని క్యాన్సర్ కణితిపై అత్యంత నియంత్రిత పద్ధతిలో కేంద్రీకరిస్తుంది. లక్ష్యంగా ఉన్న కణితికి అవసరమైన కిరణ మోతాదును అందించడంతో పాటు, చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణజాలానికి కిరణాల ప్రభావాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించడమే ఆధునిక రేఖీయ వేగవర్ధక వ్యవస్థల ప్రధాన ఉద్దేశం.

ఈ యంత్రం ద్వారా త్రిమితీయ కిరణ చికిత్స, తీవ్రత నియంత్రిత కిరణ చికిత్స, చిత్ర మార్గదర్శిత కిరణ చికిత్స, పరిమాణ నియంత్రిత కిరణ చికిత్స వంటి ఆధునిక చికిత్సా విధానాలను నిర్వహించే అవకాశం ఉంటుంది. కొన్ని అధునాతన యంత్రాల్లో ప్రత్యేకమైన కిరణ చికిత్సా విధానాలు కూడా అందుబాటులో ఉంటాయి. అయితే కాకినాడ జీజీహెచ్‌లో ఖచ్చితంగా ఏయే చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తాయన్నది ఏర్పాటు చేసే యంత్రం యొక్క నిర్దిష్ట నమూనా, దాని సాఫ్ట్‌వేర్, ఇతర వైద్య సాంకేతిక సదుపాయాలపై ఆధారపడి ఉంటుంది.

ఈ ప్రక్రియలో కంప్యూటెడ్ టోమోగ్రఫీ అనుకరణ యంత్రం పాత్ర కూడా ఎంతో ముఖ్యమైనది. ముందుగా కంప్యూటెడ్ టోమోగ్రఫీ పరీక్ష ద్వారా కణితి ఉన్న ప్రాంతాన్ని, దాని పరిమాణాన్ని, చుట్టుపక్కల ఉన్న ముఖ్యమైన అవయవాలను ఖచ్చితంగా గుర్తిస్తారు. ఆ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని చికిత్సా ప్రణాళిక రూపొందించే వ్యవస్థ ద్వారా కిరణ చికిత్సకు సంబంధించిన పూర్తి ప్రణాళికను సిద్ధం చేస్తారు. కణితిపై అవసరమైన మోతాదు ఎక్కువగా పడేలా, అదే సమయంలో చుట్టుపక్కల ఆరోగ్యకరమైన అవయవాలకు సాధ్యమైనంత తక్కువ నష్టం కలిగేలా చికిత్సను రూపొందించడానికి ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది.

ఉదాహరణకు తల, మెడ ప్రాంతంలోని క్యాన్సర్‌కు కిరణ చికిత్స అందించేటప్పుడు మెదడు, వెన్నుపాము, లాలాజల గ్రంథులు వంటి ముఖ్యమైన ఆరోగ్యకరమైన అవయవాలను రక్షిస్తూ కణితిపై కిరణాలను కేంద్రీకరించేలా చికిత్సను రూపొందించవచ్చు. ఇదే ఆధునిక కిరణ చికిత్సా సాంకేతికతలోని ప్రధాన ప్రయోజనం.

అంతేకాకుండా సుమారు రూ.3.5 కోట్ల వ్యయంతో మొబైల్ క్యాన్సర్ పరీక్షల వాహనం కూడా త్వరలో అందుబాటులోకి రానున్నట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం చికిత్సలో అత్యంత కీలకం. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు క్యాన్సర్ పరీక్షల సేవలను అందించగలిగితే, వ్యాధిని తొలిదశలోనే గుర్తించి అవసరమైన వారికి త్వరగా వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది.

క్యాన్సర్ చికిత్సలో యంత్రాలు మాత్రమే కాకుండా నిపుణులైన క్యాన్సర్ వైద్యులు, కిరణ చికిత్స నిపుణులు, వైద్య భౌతిక శాస్త్ర నిపుణులు, కిరణ చికిత్స సాంకేతిక నిపుణులు, ఇతర సాంకేతిక సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, అవసరమైన మందులు, సహాయక వైద్య సేవలు కూడా సమర్థంగా అందుబాటులో ఉండాలి. ఈ అన్ని అంశాలను సమన్వయం చేసి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తే కాకినాడ జీజీహెచ్ ఒక ముఖ్యమైన ప్రాంతీయ క్యాన్సర్ వైద్య కేంద్రంగా ఎదిగే అవకాశం ఉంది.

ప్రస్తుతం క్యాన్సర్ చికిత్స కోసం విశాఖపట్నం, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తున్న అనేక మంది రోగులకు కాకినాడలోనే ఆధునిక కిరణ చికిత్స అందుబాటులోకి రావడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం చికిత్సకు అయ్యే ఆర్థిక భారాన్ని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

కాకినాడ జీజీహెచ్‌లో ఈ కేంద్రం త్వరగా పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకుని, ఆధునిక పరికరాలతో పాటు నిపుణులైన వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచగలిగితే ఇది కేవలం కాకినాడకే కాకుండా ఉభయ గోదావరి ప్రాంతాల ప్రజలకు ఒక కీలకమైన క్యాన్సర్ వైద్య కేంద్రంగా నిలిచే అవకాశం ఉంది. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం నుంచి అత్యాధునిక కిరణ చికిత్స వరకు ఒకే ప్రాంతంలో సేవలు అందుబాటులోకి రావడం ప్రజారోగ్య రంగంలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుంది.

# పెంచలకోన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయాల అభివృద్ధికి రూ. 70 కోట్లు: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్)ఆగస్టు 22 :నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం మరియు ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయాల అభివృద్ధి పనులను వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆలయ అధికారులతో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు, గ్రానైట్ పనుల నమూనా ప్లాన్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ పెంచలకోన క్షేత్రంలోని ఆదిలక్ష్మి అమ్మవారి గుడి పునర్నిర్మాణంతో పాటు, ప్రధాన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని గ్రానైట్ రాతితో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు మొత్తం రూ. 70 కోట్ల వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేశాం అని తెలిపారు.అదేవిధంగా రాబోయే 2--3 సంవత్సరాల వ్యవధిలోనే ఆలయ అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తాం. అదేవిధంగా ఆగస్టు 30వ తేదీన ఉదయం 10:50 గంటలకు ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనుల నిమిత్తం బాలాలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నాం అని తెలిపారు.అదేవిధంగా క్షేత్రానికి విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వసతి గదులు, ఇతర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. తిరుమల తరహాలోనే భక్తులకు అన్ని రకాల సదుపాయాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ?కూటమి ప్రభుత్వంలో ఆలయాల అభివృద్ధికి సీఎం నారా చంద్రబాబు నాయుడు గారు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారు అని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన సత్రంలో భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు రాపూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్నూ అశోక్ రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో బద్వేల్ లో పసుపు జెండా ఎగరాలి.!!

## కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి.




కడప జిల్లా (బిఎన్ఎస్) ఆగస్టు 22 :కడపజిల్లా.. బద్వేల్ నియోజకవర్గం, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కలిసి బద్వేల్ నియోజకవర్గ పరిధిలో తెలుగుదేశం కార్యకర్తలు, నాయకుల మధ్యన జరుగుతున్న విస్తృత స్థాయి సమావేశంలో కడపజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన తెలుగుదేశం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. బద్వేల్ నియోజకవర్గంలో గతంలో పెద్దలు బిజివేముల వీరారెడ్డి హయాంలో బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట లాంటిదని, అలాంటి తెలుగుదేశానికి పట్టు ఉన్న బద్వేల్ నియోజకవర్గంలో గత 25 సంవత్సరాలుగా బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ జెండా ఎగరలేదని, రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్లలో ప్రతి ఒక్కరూ కష్టపడి తెలుగుదేశం పార్టీ జెండా ఎగిరేల కృషి చేయాలని, బద్వేల్ నియోజకవర్గానికి కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఇన్చార్జి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ మరింత ముందుకు తీసుకెళ్లాలని, బద్వేల్ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి వర్యులు నారాచంద్రబాబు నాయుడు, యువ నాయకులు తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ సహకారంతో బద్వేల్ నియోజకవర్గంను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడపజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, బద్వేల్ నియోజకవర్గం అబ్జర్వర్ నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి, సుధాకర్, సీనియర్ నాయకులు, డాక్టర్ రాజశేఖర్, జంబాపురం రమణారెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డార్క్ స్టోర్లపై 'TG SAFE' ఆకస్మిక దాడులు: ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘన గుర్తింపు




హైదరాబాద్ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న డార్క్ స్టోర్ల (క్విక్ కామర్స్ డెలివరీ హబ్‌లు) నిర్వాహకులపై TG SAFE విభాగం ఉక్కుపాదం మోపింది. కమిషనర్ ఆదేశాల మేరకు TG SAFE ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఫుడ్ సేఫ్టీ అధికారులు మరియు పోలీసులతో కలిసి బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. మొత్తం 10 ప్రత్యేక బృందాలుగా ఏర్పడిన అధికారులు ఫుడ్ డెలివరీ నెట్‌వర్క్‌ల కార్యకలాపాలపై నిఘా పెట్టి ఈ రైడ్స్ నిర్వహించారు. ఈ విస్తృత తనిఖీల్లో భాగంగా CURE (సిటీ యూనిఫైడ్ రెగ్యులేటరీ ఎన్‌ఫోర్స్‌మెంట్) పరిధిలోని దాదాపు 20 డార్క్ స్టోర్లపై అధికారులు విరుచుకుపడ్డారు. ప్రముఖ ఆన్‌లైన్ గ్రాసరీ యాప్‌లైన బిగ్‌బాస్కెట్ (BigBasket), బ్లింకిట్ (Blinkit), జెప్టో (Zepto)లకు చెందిన ప్రధాన నిల్వ కేంద్రాలలో ఈ సర్‌ప్రైజ్ రైడ్స్ జరిగాయి. వినియోగదారులకు నిమిషాల వ్యవధిలో సరుకులు అందించే ఈ స్టోర్లలో ఆహార నాణ్యత, భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.తనిఖీల సందర్భంగా పలు డార్క్ స్టోర్లలో పారిశుధ్య నిర్వహణ అత్యంత అధ్వాన్నంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గిడ్డంగుల్లో ఆహార పదార్థాల నిల్వ నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించడమే కాకుండా, కొన్ని చోట్ల ఏకంగా గడువు ముగిసిన (ఎక్స్‌పైర్డ్) ఆహార పదార్థాలను విక్రయానికి సిద్ధంగా ఉంచడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను బొత్తిగా పట్టించుకోని ఆయా స్టోర్ల యజమానులకు అధికారులు తక్షణమే చట్టపరమైన నోటీసులు జారీ చేశారు.ఈ రైడ్స్‌లో భాగంగా అనుమానాస్పదంగా ఉన్న, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన పలు ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ శాంపిల్స్‌ను ల్యాబ్‌లకు పరీక్షల నిమిత్తం పంపామని, నివేదికలు రాగానే సంబంధిత నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే డార్క్ స్టోర్లపై రాబోయే రోజుల్లోనూ TG SAFE ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# భారతి సిమెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల న్యాయపరమైన కోర్కెలు తీర్చాలి.!!

- రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ బృందం.



కడప జిల్లా (బిఎన్ఎస్)ఆగస్టు 22 :వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి భారతి సిమెంట్ ఫ్యాక్టరీకి భూములిచ్చిన ప్రజలకు, మరియు కార్మిక చట్టాలను తుంగలోతొక్కి కార్మికులకు, జగన్మోహన్ రెడ్డి నిర్మించుకున్న బాత్ రూమ్ విలువ కూడా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి తీవ్రంగా మీడియా ముందు విమర్శించారు. భారతి సిమెంటు పరిశ్రమ స్థాపించడానికి రైతులకు, భూ నిర్వాసితులకు కల్లబొల్లి మాటల చెప్పి మభ్యపెట్టి భూములు తీసుకొని, ఈరోజు భారతి సిమెంట్ పరిశ్రమ ద్వారా వేలాది కోట్లు గడిస్తూ ఇచ్చిన మాట తప్పుతూ కార్మిక చట్టాలను అవహేళన చేస్తూ స్థానికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. మాట తప్పే మోసగాడు, అబద్ధాల కోరు జగన్ అంటూ ఇలాంటి జగన్మోహన్ రెడ్డి అనే వ్యక్తి కోసం ఈ ప్రాంత ప్రజలు చొక్కాలు చించుకొని, రక్తాలు చిందిస్తూ సైకోల్లా ప్రవర్తించడానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు. భారతి సిమెంట్ పరిశ్రమలో జరుగుతున్న పరిస్థితి చూస్తుంటే టిడిపి ప్రభుత్వంలో కూడా జగన్ పాలన చేస్తున్నట్లు ఉందన్నారు. కార్మికుల చట్టాలను అమలు చేయని, పాటించని వ్యక్తికి ఏవిధంగా గతంలో ప్రజలు పరిపాలన అప్పచెప్పారో అర్థం కాలేదన్నారు. ఈ క్రమంలో న్యాయపరమైన కార్మికుల కోర్కెలు తీర్చాలని భారతి సిమెంట్ పరిశ్రమ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# కడపజిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలను అరికట్టాలి.!!

- సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్.



కడప జిల్లా(బిఎన్ఎస్)ఆగస్టు 22 :కడపజిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలను అరికట్టాలి అంటూ తెలుపుతున్న క్రమంలో బ్రహ్మంగారిమఠం మండలంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, మోటార్ కేబుళ్ల దొంగతనాలు వరుసగా జరుగుతున్నప్పటికీ వాటిని అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ ఆరోపించారు. శనివారం నర్సిరెడ్డి పల్లెలో ట్రాన్స్ ఫార్మర్ దొంగతనం జరిగిన ప్రాంతాన్ని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగింది అన్నారు. ఈ సందర్భంగా సునీల్ మీడియాతో మాట్లాడుతూ.. లింగాలదిన్నెపల్లి గ్రామానికి చెందిన రైతు చీమల రామిరెడ్డి (62) నర్సిరెడ్డి పల్లెలో గాలి కరుణాకర్ రెడ్డికి చెందిన పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్నారు. అయితే గత రాత్రి పొలంలో ఉన్న 16 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి, అందులోని కాపర్‌ను అపహరించినట్లు ఆయన తెలిపారు. మండలంలో గత కొంతకాలంగా రైతుల మోటార్ కేబుల్ వైర్లు, విద్యుత్ పరికరాలు దొంగతనానికి గురవుతున్నాయని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు. దొంగతనాలపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ నిందితులను పట్టుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వారు అన్నారు. మండలంలో వరుస చోరీలతో రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని వారు అన్నారు. వరుస చోరీలపై పోలీసు యంత్రాంగం స్పందించి రైతులకు భరోసా కల్పించే విధంగా దొంగలను పట్టుకొని కటినంగా శిక్షించాలని వారు తెలిపారు. రైతుల పంటలకు నీరు అందించే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన దొంగలు అందులోని కాపర్ మరియు విలువైన పరికరాలను అమ్ముకుంటూ సొమ్ముచేసుకుంటూ పదే, పదే చోరీలకు పాల్పడుతున్నారన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, పంటలకు సాగునీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ పెంచాలని, రైతుల ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ కేబుళ్లకు భద్రత కల్పించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గోవింద్, రైతులు పాల్గొన్నారు.

# వివేకా హత్య కేసులో సోదాలు.. కొత్త నేరాలకు సాక్ష్యాలు దొరికాయా..?



కడప జిలా (బిఎన్ఎస్)ఆగస్టు 22 : వైఎస్ వివేకా హత్య కేసులో ఈడీ అధికారులు హైదరాబాద్, కడప పరిధిలోని పలుచోట్ల నిర్వహించిన సోదాలు ఏపీ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపాయి. అవినాష్ రెడ్డి నివాసం నుంచి లెక్కల్లో చూపని 24 లక్షల నగదుతో పాటు 2 బ్యాంక్ లాకర్ తాళాలు, కీలకమైన డిజిటల్ పరికరాలు, డాక్యుమెంట్లను ఈడీ స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. వివేకా కేసు సాక్ష్యాలు ఇప్పటి వరకూ ఉంచే చాన్స్ లేదు కానీ, వారి ఇతర సెటిల్మెంట్ల గుట్టు ఈడీకి నిన్న జరిగిన సోదాలలో దొరికినట్లుగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దొరికిన డిజిటల్ పరికరాలు, బ్యాంక్ లాకర్లు తెరిస్తే అసలు అవినాష్ రెడ్డి వ్యాపారం ఏమిటి అన్న స్పష్టత ఇస్తుందన్న గుస,గుసలు ప్రజల్లో అధికంగా వినిపిస్తున్నట్టు సమాచారం..